విశాఖపట్టణం
సోమవారం 3 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:191 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## సోషల్ మీడియానే శరణ్యం!

### కొత్త రాజకీయ ఆయుధంగా భావన

### పెరుగుతున్న డిజిటల్ క్యమూనికేషన్.. పాదయాత్రలకు ఇక కాలం చెల్లినట్లే

# రాజకీయ ఉద్రిక్తత

## కర్నూలులో రణరంగం

### టీడీపీ, వైసీపీ కార్యకర్తల పరస్పర దాడులు

### దౌర్జన్యానికి పాల్పడ్డారని ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు

(కర్నూలు - జయజయహే)

**వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎమ్మెల్యేతో సహా 15 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీ నేతల మధ్య ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడం, దౌర్జన్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బి. విరూపాక్షిపై కేసు నమోదైంది. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులైన 15 మందిపై చిప్పగిరి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితుడైన టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.**





పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురునాథ్, సంగాల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గిరిల మధ్య ఫోన్‌లో వ్యక్తిగత దూషణలు జరిగాయి. ఈ వివాదం కాస్తా పెరిగి వారి మధ్య గొడవకు దారితీయగా.. ఈ విషయాన్ని కార్యకర్త గిరి వైసీపీకి చెందిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షికి తెలియజేశాడు. ఎమ్మెల్యే తన అనుచరులతో కలసి నేమకల్లు గ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే అక్కడ ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్రమై పరస్పరం రాళ్లు రువ్వుకునే వరకు వెళ్లింది. ఈ రాళ్లదాడిలో టీడీపీకి చెందిన శేఖర్ తలకు తీవ్ర గాయం కాగా, నాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు చేతికి కూడా గాయమైందని తెలిసిందే.

**కారుపై దాడి.. అద్దాలు ధ్వంసం**

ఘటనపై సమాచారం అందుకున్న ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వెంటనే గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం, రాళ్లదాడిలో గాయపడిన తమ కార్యకర్తలను పరామర్శించేందుకు టీడీపీ మండల కన్వీనరు కొండా పురుషోత్తం, సొసైటీ చైర్మన్ రామాంజినేయులు నేమకల్లుకు ..మిగతా 2లో



### అరుదైన నాయకుడిని..


## అందనంత దూరం పెట్టిన టీడీపీ

### ఓటమి ఎరుగని నాయకునికి ఎందుకా కట్టడి

### ప్రజల్లో హీరో...పార్టీలో జీరో అంటూ కేడర్ గుస గుసలు

(ప్రత్యేక ప్రతినిధి జయ జయహే)

ఏపీ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నాయకుల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒకరు. ఎంత క్లిష్ట పరిస్థితుల్లోనయినా గెలిచి వచ్చే దమ్మున్న నేతల్లో అరుదైన నేత. వైసీపీ ప్రభంజనంలోనూ సునాయాసంగా విజయ దుందుభి మోగించిన గంటా శ్రీనివాసరావు ఇటీవల భీమిలి ఎన్నికల్లోనూ ఈజీగా గెలిచేశారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న ఆయన, వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయాలు సాధించిన అరుదైన నాయకుడిగా గుర్తింపు పొందారు. రాష్ట్ర రాజకీయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆయన ప్రస్థానం అన-ుభవం, పరిపాలనా సామర్థ్యం, ప్రజలతో సన్నిహిత అనుబంధానికి నిదర్శనంగా చెప్పుకుంటారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం, విద్య, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి వంటి రంగాల్లో కృషి చేయడం ద్వారా ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. మంత్రి హోదాలో ..మిగతా 2లో



# లగ్జరీ లిక్కర్ హవా..!

### ఖరీదైన బ్రాండ్లకే ప్రాధాన్యత

### సింగిల్ మాల్ట్, టకీలా, స్కాచ్ విస్కీలకు ఆదరణ

### కోట్లాది కేసులు అమ్మకాలు

### ఆదాయంలో రెండంకెల వృద్ధి

### మద్యం ప్రియుల్లో మారుతున్న ట్రెండ్

ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతీయ మద్యం మార్కెట్లో వ్యాపార సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. సాధారణ మద్యం విక్రయాల వేగం మందగించిన వేళ, మద్యం తయారీ సంస్థలకు లగ్జరీ స్పిరిట్స్ విభాగం కొత్త ఆశాకిరణంగా మారింది. కస్టమర్లు పరిమాణం కంటే నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తూ ఖరీదైన బ్రాండ్ల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ మార్పును పసిగట్టిన డియాజియో ఇండియా, ఆల్కహాల్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ , రేడికో ఖైతాన్, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్, ఆల్కోబ్రూ డిస్టిలరీస్ వంటి ప్రముఖ సంస్థలు లగ్జరీ కేటగిరీపై దృష్టి సారించాయి. బాటిల్ ధర రూ. 3,500 నుంచి ఏకంగా రూ. 27,500 వరకు ఉండే ప్రీమియం సింగిల్ మాల్ట్స్, టకీలా, ..మిగతా 3లో



## ఆగస్టు 5న సీజేపీ కీలక భేటీ

### భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై ఆందోళనలతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సీజేపీ సంస్థ ఆగస్టు 5న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో వ్యవస్థాపకుడు అభిజిత్ నివాసంలో కోర్ కమిటీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది. గత నెల రోజులుగా చేపట్టిన ఉద్యమంపై సమీక్షతో పాటు, ఇకపై అనుసరించాల్సిన వ్యూహంపై నిర్ణయాలను కూడా ఈ సమావేశంలో తీసుకోనున్నారు. రాష్ట్రాల వారీగా విద్యార్థులు, వాలంటీర్లు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలను కూడా కోర్ కమిటీ చర్చించనుంది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి ..మిగతా 2లో



## ఏపీ-ఆస్ట్రేలియా బంధం

### కుదిరిన నాలుగు ఎంఓయూలు

### క్లీన్ ఎనర్జీ, విద్యా, నైపుణ్యం, సోలార్‌లకు ప్రాధాన్యత

### మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందాలు

(అమరావతి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ - ఆస్ట్రేలియాల మధ్య నాలుగు ఎంవోయూలు కుదిరాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ , ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవోయూలను కుదుర్చుకున్నారు. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ - ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు జరిగినట్లు లోకేశ్ తెలిపారు. ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌కి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గత సంవత్సరం తన ఆస్ట్రేలియా పర్యటన ..మిగతా 2లో

## శ్రమ జగన్‌ది..
## క్రెడిట్ చోరీ చంద్రబాబుది

### వైసీపీ హయాంలోనే అనుమతులు, భూసేకరణ

### మోదీ ముందే సీఎం చంద్రబాబు అబద్ధాలు

### సభలో జీఎమ్ఆర్‌తో ఎందుకు మాట్లాడించలేదు?

### జగన్ ఎర్ర బస్సు వ్యాఖ్యలపై తప్పుడు ప్రచారం

### సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి గుడివాడ అమర్ ధ్వజం



(విశాఖపట్నం - జయజయహే)

కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని, కేవలం పబ్లిసిటీ ఈవెంట్ మేనేజ్‌మెంట్, అబద్ధాల ప్రచారం, 'రెడ్ బుక్' రాజ్యాంగంతోనే కాలయాపన చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, ..మిగతా 2లో

## ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో విషాదం

### గంగవరం బీచ్‌లో ఈద్దరు గల్లంతు

### బీచ్‌కు వెళ్లిన ముగ్గురు యవతులు, ఇద్దరు యువకులు

### గాలిస్తున్న న్యూ పోర్టు పోలీసులు



2

### రైతుబజార్లలో
## క్వాలిటీ బియ్యం

### కిలో. 52కే బీపీటీ రైస్ అమ్మకం

### 150 రైతుబజార్లలో అవుట్ లెట్లు

### మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

(విజయవాడ - జయజయహే)

విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినియోగ దారులకు భారీ ఊరటగా రూ.52కే కిలో నాణ్యమైన సన్న బియ్యం అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో విక్రయాలు ప్రారంభం ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహో


# శ్రమ జగన్‌ది..క్రెడిట్ చోరీ చంద్రబాబుది

మొదటి పేజీ తరువాయి...

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలోనే సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ఒకటే అబద్ధపు స్క్రిప్ట్ చదువుతూ క్రెడిట్ చోరీకి పాల్పడ్డారని మండిపడ్డారు. 2019కి ముందు భూ సేకరణ, కాంట్రాక్టర్, ఫైనాన్షియల్ క్లోజర్, క్లియరెన్సులు లేకుండా కేవలం ఎన్నికల గారడీ కోసం శంకుస్థాపన చేసిన చంద్రబాబు, ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు కొబ్బరికాయ కొట్టి, గుమ్మడికాయ కట్టి తమదే ఘనత అని చెప్పుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. వైఎస్. జగన్ హయాంలోనే రూ.1,000 కోట్లతో 2,700 ఎకరాల భూసేకరణ, నిర్వాసితులైన 4 గ్రామాల ప్రజలకు రూ.10 లక్షల చొప్పున పరిహారంతో పునరావాసం అందించడంతో పాటు, జీఎమ్ఆర్ ఇన్ కార్పొరేషన్ సహా డిజిసిఏ, ఎన్విరాన్ మెంట్ వంటి సకల అనుమతులు వచ్చాయని డాక్యుమెంట్లతో సహా స్పష్టం చేశారు. వైఎస్.జగన్ తెచ్చిన రూ.6,300 కోట్ల డెడికేటెడ్ రోడ్డు కారిడార్‌ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు విశాఖ నుంచి భోగాపురం వరకు రూ.4,000 టాక్సీ ఛార్జీలతో సామాన్యుడిపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఉత్తరాంధ్రను ఓటు బ్యాంకుగా వాడుకుని గిన్నిస్ బుక్ ప్రచారాలకే పరిమితమైతే, వైఎస్ జగన్ ఐదేళ్లలో ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్, మూలపేట పోర్ట్, మెడికల్ కాలేజీలు, గిరిజన యూనివర్సిటీ, అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్ వంటి అనేక ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపారని వివరించారు.





### పిఎం మోదీ వేదికగా అబద్ధాల స్క్రిప్ట్

సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారి ముందే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, సకల శాఖ మంత్రి నలుగురూ కలిసి ఒకటే అబద్ధపు స్క్రిప్ట్ చదివారు. గత రెండు సంవత్సరాలుగా ఏ వేదిక దొరికినా జగన్ నామస్మరణ చేయడమే పనిగా పెట్టుకున్న కూటమి నాయకులు, ప్రధాని ముందే అబద్ధాలు చెప్పడానికి వెనకాడలేదు. మోదీ గారి ముందే ధైర్యంగా అబద్ధాలు చెప్పిన వీరు ప్రజలకు ఇంకెన్ని అబద్ధాలు చెప్తారో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబు నాయుడు గారు మాట్లాడుతూ కొబ్బరికాయ కొట్టింది నేనే, గుమ్మడికాయ కట్టింది నేనే అంటున్నారు. అవును, మీరు చేసింది ఆ రెండే! మధ్యలో మిగిలిన అసలైన నిర్మాణ పని అంతా వైఎస్ జగన్ గారే చేశారు. కొబ్బరికాయ కొట్టడానికి, గుమ్మడికాయ కట్టి దానికి ముఖ్యమంత్రి అక్కర్లేదు, దారినపోయే ఎవడైనా కడతాడు. కానీ 2,700 ఎకరాల భూమి సేకరించి, అన్ని క్లియరెన్సులు తెచ్చి భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించింది మాత్రం జగన్ మోహన్ రెడ్డి గారే.

### కేవలం శంకుస్థాపన రాళ్లే

2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి 2,007 ఎకరాలకు గాను సేకరించింది కేవలం 270 ఎకరాలు మాత్రమే. అంటే 10 శాతం భూమి కూడా లేదు. భూమి లేదు, కాంట్రాక్టర్ లేదు, జీఎమ్ఆర్ ఇన్ కార్పొరేషన్ లేదు, ఫైనాన్షియల్ క్లోజర్ లేదు.. ఏమీ లేకుండా ఫిబ్రవరి 2019లో చంద్రబాబు ఎవరిని మభ్యపెట్టడానికి శంకుస్థాపన చేశారు? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు వేసి తుప్పుపట్టిన వేలాది శంకుస్థాపన రాళ్లలాగే ఇది కూడా ఒక ఎన్నికల గారడీ. 130 కి పైగా లీగల్ ఇష్యూస్‌ను పరిష్కరించి, మే 2020లో జీఎమ్ఆర్ ఇన్ కార్పొరేషన్ చేయించి, రూ.1000 కోట్లు ఖర్చు పెట్టి ల్యాండ్ అక్విజిషన్, ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసింది జగన్ ప్రభుత్వం.

### అన్ని అనుమతులూ వైఎస్ జగన్ హయాంలోనే

ఎన్విరాన్మెంటల్ క్లియరెన్సులు, ఫైర్, డిజిసిఏ, సేఫ్టీ క్లియరెన్సెస్ అన్నీ 2019-2024 నడుమ వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే వచ్చాయి. 2023 మే 3న జగన్ ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేస్తూ 2026 నాటికి ఎయిర్‌పోర్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. అదే రోజు జీఎమ్ఆర్ గారు కూడా 36 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నిన్నటి వేదికపై రూ.5,600 కోట్ల పెట్టుబడి పెట్టిన పారిశ్రామికవేత్త జీఎమ్ఆర్ గారిని ఎందుకు మాట్లాడనివ్వలేదు? ఆయన మాట్లాడితే నిజాలు బయటపడి, చంద్రబాబు క్రెడిట్ చోరీ దొరికిపోతుందనే భయంతోనే ఆయన నోరు నొక్కేశారు.

### రెడ్ బుక్ రాజ్యాంగం... గిన్నిస్ బుక్ ప్రచారం

ఈ రెండున్నరేళ్ల కూటమి పాలనలో రాష్ట్రానికి మిగిలింది చంద్రబాబు గారి 'రెడ్ బుక్', 'గిన్నిస్ బుక్', 'ఫేస్‌బుక్' మాత్రమే. డాన్సులు, యోగాలు చేయించి గిన్నిస్ బుక్ వచ్చిందని గొప్పలు చెప్పుకోవడం కాదు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఎత్తున అబద్ధాలు చెప్పినందుకు, రియల్ ఎస్టేట్ రాజధాని పేరిట లక్ష ఎకరాలు సేకరించినందుకు చంద్రబాబుకి గిన్నిస్ బుక్ రికార్డు ఇవ్వాలి. రాజ్యాంగాన్ని పక్కన పెట్టి అబద్ధాల మీద, పబ్లిసిటీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ మీద బ్రతికేస్తున్నారు. ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకట రామయ్య , ఎస్.ఇ.సి సభ్యులు రవి రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి గండి రవి కుమార్ పాల్గొన్నారు .

# ఆగస్టు 5న సీజేపీ కీలక భేటీ

మొదటి పేజీ తరువాయి...

భవిష్యత్ కార్యాచరణను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. తదుపరి దశలో చేపట్టే ఉద్యమాలు, కార్యక్రమాలపై కూడా స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. విద్యార్థి నిరసనల అంశంపై స్పందిస్తూ పిల్లలను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయితే క్షమాపణలతో సరిపెట్టకుండా విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ డిమాండ్ చేశారు. అలాగే జులై 20న జరిగిన పోలీసు చర్యపై ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. ఏదేమైనా ఆగస్టు 5 సమావేశం అనంతరం సీజేపీ ఉద్యమం ఏ దిశగా సాగనుందనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

# రైతుబజార్లలో క్వాలిటీ బియ్యం

మొదటి పేజీ తరువాయి...

అయ్యాయి. ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. బహిరంగ మార్కెట్‌లో కిలోకు సుమారు రూ.10 వరకు ధరలు పెరిగినట్లు గుర్తించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో కలిసి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం సరఫరా నిర్ణయం తీసుకుంది సర్కార్. బీపీటీ స్టీమ్ రైస్‌ను రూ.64--65 నుంచి తగ్గించి రూ.52కే అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్క కుటుంబానికి 10 కిలోల వరకు ఈ ధరకు బియ్యం కొనుగోలు అవకాశం ఉంటుంది. బీపీటీ పచ్చి బియ్యం రూ.58--60 నుంచి తగ్గించి రూ.50కే విక్రయిస్తున్నారు. సబ్సిడీ ధరల విక్రయాలు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 2 నుంచే ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోని రైతు బజార్లు, రైస్‌మిల్ అవుట్‌లెట్ల ద్వారా విస్తృతంగా సరఫరా జరుగుతుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నియంత్రణ సాధించడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. దేశంలోనే తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించే ప్రత్యేక కార్యక్రమంపై జనాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కందిపప్పు, పామాయిల్ ధరల నియంత్రణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా నిరంతర చర్యలు కొనసాగుతాయని మంత్రి నాదెండ్ల అన్నారు.

'ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 650 కేంద్రాల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాల కార్యక్రమాన్ని విజయవాడ ఐపీఐఐసీ రైతు బజార్‌లో ప్రారంభించాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజలపై ధరల భారాన్ని తగ్గించి, నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇదే రకం బియ్యం కిలో రూ.60--62కు విక్రయమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రూ.50--52కే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చాం.' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఏపీ-ఆస్ట్రేలియా బంధం

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా జరిగిన ఫలవంతమైన చర్చల ఫలితంగా, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశామని వెల్లడించారు. ఈ ఎంఓయూల ద్వారా తమ ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఈ అవగాహన ఒప్పంద ఆవిష్కరణ, ప్రతిభ, ఉమ్మడి శ్రేయస్సుపై నిర్మించిన బలమైన ఆంధ్రప్రదేశ్ – ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# సోషల్ మీడియానే శరణ్యం..!

## కొత్త రాజకీయ ఆయుధంగా భావన

## పెరుగుతున్న డిజిటల్ క్యమూనికేషన్

## పాదయాత్రలకు ఇక కాలం చెల్లినట్లే

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది... రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా? పాదయాత్రల నుంచి పబ్లిక్ సర్వీస్ వరకు... మారుతున్న రాజకీయాల కొత్త ఫార్ములా! అనే చర్చ సాగుతోం0ది. ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉ ండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది... రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా? చర్చ సాగుతోంది.

### పాదయాత్రలకు చెల్లుచిటీ..

తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### కొత్త రాజకీయ ఆయుధాలు

ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి. అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి. 2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి... వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

# ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో విషాదం

## గంగవరం బీచ్‌లో ఈద్దరు గల్లంతు

## బీచ్‌కు వెళ్లిన ముగ్గురు యవతులు, ఇద్దరు యువకులు


## గాలిస్తున్న న్యూ పోర్టు పోలీసులు

(విశాఖపట్నం - జయజయహే)

విశాఖపట్నంలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు విషాదంగా మారాయి. స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లిన యువతి, యువకుడు భారీ అలల్లో గల్లంతయ్యారు. ఫోటోలు దిగుతుండగా ఒక్కసారిగా ఎగసిపడిన కెరటం ఈ ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విశాఖపట్నంలోని పెదగంట్యాడ మండలం పాత గంగవరం బీచ్‌లో ఆదివారం ఉదయం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పెద జాలారిపేటకు చెందిన నీతూ, రాము తమ స్నేహితులతో కలిసి ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా బీచ్‌కు వెళ్లారు. మొత్తం ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు సముద్ర తీరంలో సందడి చేశారు. ఈ క్రమంలో ఫోటోలు తీసుకునేందుకు సముద్రంలోని రాతిపై నిలబడ్డారు. అదే సమయంలో ఒక్కసారిగా భారీ కెరటం ఎగసిపడటంతో నీతూ, రాము సముద్రంలో పడిపోయారు. అక్కడున్న స్నేహితులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న న్యూపోర్ట్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. గల్లంతైన ఇద్దరి కోసం పోలీసులు, స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలిస్తున్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు, ఫోటోల కోసం సముద్రంలోని రాళ్లపైకి వెళ్లొద్దని, అలల తీవ్రతను తక్కువగా అంచనా వేయవద్దని పోలీసులు ప్రజలకు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గల్లంతైన యువతి, యువకుడి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# అరుదైన నాయకుడిని.. అందనంత దూరం పెట్టిన టీడీపీ

మొదటి పేజీ తరువాయి...



విద్యాశాఖతో పాటు ఇతర కీలక శాఖలను నిర్వహించిన సమయంలో పలు సంస్కరణలు చేపట్టారని ఆయన అనుచరులు పేర్కొంటారు. అలాగే, రాజకీయ పరిస్థితులు మారినా ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా చెబుతారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించే నాయకుడిగా గంటా శ్రీనివాసరావు గుర్తింపు పొందారు. రాజకీయ అనుభవం, ఎన్నికల వ్యూహం, ప్రజలతో మమేకమయ్యే తీరు కారణంగా ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా నిలిచారు. ఎన్నికల ఫలితాల్లో విజయాల పరంపర కారణంగా ఆయనను అభిమానులు "ఓటమి ఎరుగని నాయకుడు"గా అభివర్ణిస్తుంటారు. అయితే, ఇది రాజకీయ మద్దతుదారులు ఉపయోగించే అభివర్ణనగా చూడాలి. ప్రజా సేవ, అభివృద్ధి, అనుభవం అనే మూడు స్తంభాలపై తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తూ గంటా శ్రీనివాసరావు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఇదంతా ఓ ఎత్తయితే...ఇప్పుడు పార్టీలో ఆయన స్థానంపై నీలినీడలు కమ్ముకున్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం అంతా ఆయన నియోజక వర్గ సమీపంలోనే జరిగింది. అందుకు ఆ నియోజక వర్గం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చోటు చేసుకుంది. కానీ ఆయన మాత్రం ఎక్కడా పెద్దగా కనిపించిన దాఖలాలు లేవు. ఆయన నియోజక వర్గానికి సంబంధించి కూడా ఇటీవల కాలంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే అపవాదుంది. గత రెండేళ్లుగా సింహాచలం చందనోత్సవాలకు హాజరు కావడం లేదంటే...ఆయన ఎంత దూరంగా ఉంటున్నారో వేరేగా చెప్పాల్సిన పని లేదు. అయితే టీడీపీలో సీనియర్ నేతగా...ఓటమి ఎరుగని ప్రజాప్రతినిధిగా ఆయన సేవలు పార్టీ వినియోగించుకోవడంపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ జూనియర్ నేతలంతా మంత్రులుగా ఉంటే....వారందరికీ సీనియర్ అయిన గంటా మాత్రం దూరంగా ఉంటున్నారా...దూరం పెట్టారా అన్న సంగతి తెలీక కేడర్ సతమతమవుతోంది. పార్టీలో పెద్ద తలకాయలన్నీ గంటాకు సుపరిచితులే కానీ...జూనియర్లు అధికారం చెలాయిస్తుంటే....తట్టుకోవడం కాస్త కష్టమేనని కేడర్ భావిస్తోంది.



# రాజకీయ ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి...

వెళ్లగా... వైసీపీ నాయకులు వారి కారుపై దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడ నుంచి పంపించివేశారు. తీవ్రంగా గాయపడిన శేఖర్, నాగరాజులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాములును గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తమ కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఆమె తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, ఈ ఘటనలో ఎమ్మెల్యే విరూపాక్షి చిప్పగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బైఠాయించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడైన టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే విరూపాక్షిపై కేసు నమోదు చేసినట్లు చిప్పగిరి ఎస్ఐ వెల్లడించారు. ఈ ఘర్షణ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిప్పగిరి, నేమకల్లు, సంగాల గ్రామాల్లో పోలీసులు భారీగా బందోబస్తు, పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# లగ్జరీ లిక్కర్ హవా..!

**మొదటి పేజీ తరువాయి...**

స్కాచ్ విస్కీలు, విదేశీ వైన్లను మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాయి. కేవలం ఎక్కువ లీటర్ల మద్యం అమ్మడం కంటే, అధిక రాబడిని ఇచ్చే ఖరీదైన సీసాల విక్రయం పైనే కంపెనీలు శ్రద్ధ చూపుతున్నాయి.

**గణాంకాలు చెబుతున్నది ఇదీ..**

లండన్‌కు చెందిన అంతర్జాతీయ పరిశోధన సంస్థ ఐడబ్ల్యూఎస్ఆర్ అందించిన వివరాల ప్రకారం, 2019 నుంచి 2025 మధ్య కాలంలో దేశంలో మొత్తం మద్యం వినియోగం ఏడాదికి కేవలం 3 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు మాత్రమే నమోదు చేసింది. అయితే, ఇదే సమయంలో ప్రీమియం స్పిరిట్స్ 22 శాతం, అల్ట్రా-ప్రీమియం 23 శాతం, ప్రిస్టీజ్ 31 శాతం వృద్ధి చెందగా, ప్రిస్టీజ్ ప్లస్ విభాగం రికార్డు స్థాయిలో 53 శాతం విస్తరించింది. ప్రస్తుతం భారతదేశంలో ఏడాదికి సుమారు 44 కోట్ల కేసుల మద్యం వినియోగం జరుగుతోంది. అందులో ప్రీమియం, అంతకంటే ఎక్కువ ధర కలిగిన బ్రాండ్ల వాటానే 43 శాతంగా ఉంది. రూ. 1,000 నుంచి రూ. 1,500 మధ్య ధర ఉండే ప్రీమియం కేటగిరీ ఏటా 12 కోట్ల కేసుల విక్రయాలు సాధిస్తుండగా, ప్రిస్టీజ్, లగ్జరీ బ్రాండ్లు ఏటా 1 కోటి కేసుల మార్కును దాటి రెండంకెల వృద్ధితో దూసుకుపోతున్నాయి.

**'తక్కువ తాగినా.. నాణ్యమైనదే తాగుతాం'**

ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, మారుతున్న జీవనశైలి, ఇంట్లోనే నాణ్యమైన మద్యం సేవించే అలవాటు పెరగడమే ఈ మార్పుకు ప్రధాన కారణమని రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు. "కస్టమర్లు ఇప్పుడు తక్కువగా తాగినా,



నాణ్యమైన మద్యమే తాగాలని కోరుకుంటున్నారు" అని ఆల్కహాల్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్ సిన్హా తెలిపారు. మార్కెట్లో రూ. 5,000 నుంచి రూ. 10,000 ధరల శ్రేణి ఒక 'అఫర్డబుల్ లగ్జరీ' విభాగంగా రూపుదిద్దుకుందని, ఈ ధరల పరిధిలోనే త్వరలో కొత్త విస్కీని విడుదల చేయనున్నట్లు సిన్హా వెల్లడించారు. రాబోయే 5 నుంచి 10 ఏళ్లలో ప్రపంచంలోనే అత్యంత భారీ ప్రీమియం విస్కీ మార్కెట్లలో భారత్ ఒకటిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఐడబ్ల్యూఎస్ఆర్ సీనియర్ కన్సల్టెంట్ జేసన్ హోల్వే మాట్లాడుతూ, "విస్కీ విభాగంలో కనిపిస్తున్న ప్రీమియమైజేషన్ ట్రెండ్, టకీలా, జిన్ వంటి ఇతర స్పిరిట్స్ విభాగాలకు వేగంగా విస్తరిస్తోంది," అని విశ్లేషించారు.

**లగ్జరీ అనుభూతులు, ప్రత్యేక ఎడిషన్లు**

దిగ్గజ సంస్థ డియాజియో ఇండియా కూడా తన గోదావణ్, డాన్ జులియో వంటి బ్రాండ్లను విస్తరిస్తూ, కస్టమర్ల కోసం ప్రత్యేకమైన లిమిటెడ్ ఎడిషన్లను అందుబాటులోకి తెస్తోంది. లగ్జరీ స్పిరిట్స్ విభాగం 2022-2025 మధ్య కాలంలో 16 శాతం వృద్ధిని, గడిచిన ఐదేళ్లలో 29 శాతం గ్రోత్ నమోదు చేసిందని కంపెనీ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ అమితాభ్ పాండే పేర్కొన్నారు. స్వతంత్ర బాట్లర్ ఇస్ట్మస్ 44 ఫౌండర్ సచిన్ మెహతా స్పందిస్తూ, "కస్టమర్లు సాధారణ డిస్టిలరీ బ్రాండ్ల కంటే అరుదైన సింగిల్-కాస్క్ ఎక్స్‌ప్రెషన్లు, ప్రత్యేక బాట్లింగ్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు" అని చెప్పారు.

**వేగంగా పెరుగుతున్న కంపెనీల ఆదాయాలు**

రేడికో ఖైతాన్ సంస్థ తన లగ్జరీ విభాగానికి పెద్దపీట వేస్తోంది. రాంపూర్ ఇండియన్ సింగిల్ మాల్ట్, జైసల్మేర్ ఇండియన్ క్రాఫ్ట్ జిన్, రాయల్ రణథంబోర్ విస్కీలతో కూడిన సంస్థ లగ్జరీ పోర్ట్‌ఫోలియో 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 340 కోట్ల విక్రయాలు సాధించగా, 2026 ఆర్థిక సంవత్సరంలో ఆ ఆదాయం ఏకంగా రూ. 475 కోట్లకు చేరింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ కూడా తన 'సెవెన్ ఐలాండ్స్ ప్యూర్ మాల్ట్ విస్కీ'ని 2027 ఆర్థిక సంవత్సరంలో 10 కంటే ఎక్కువ రాష్ట్రాలకు విస్తరించాలని నిర్ణయించింది. మోనార్క్ లెగసీ ఎడిషన్ బ్రాండీ, సంసార జిన్ బ్రాండ్ల అమ్మకాలను పెంచేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మరోవైపు టాండన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి ప్రతుల్ టాండన్ మాట్లాడుతూ, "పరిమాణం కంటే నాణ్యత, స్వచ్ఛతకే ప్రాధాన్యం ఇస్తున్న భారతీయుల కోసం రూ. 3,500 నుంచి రూ. 10,000 ధర కలిగిన 12 రకాల ఇటాలియన్ వైన్లను తెచ్చాం" అని తెలిపారు. కస్టమర్ల ప్రాధాన్యతలు మారుతున్న కొద్దీ రాబోయే రోజుల్లో లగ్జరీ బ్రాండ్లకు భారత్‌లో మరింత ఆదరణ లభించనుంది.




## శ్రీనివాసుని దర్శించుకున్న క్రికెటర్ హార్ధిక్ పాండ్యా

**తిరుమల,ఆగస్టు 02, జయ జయహే.**

టీమిండియా ఆల్‌రౌండర్ హార్ధిక్ పాండ్యా ఆదివారం తన స్నేహితురాలు మహికా శర్మతో కలిసి తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున ముందుగా స్వామివారికి తలనీలాలు సమర్పించిన ఆయన అనంతరం సుప్రభాత సేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మాడుగుల మండలంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

**మాడుగుల ఆగస్టు 2 జయ జయహే**



మాడుగుల మండలంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేయనున్నారు. వాటి వివరాలను ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఉదయం 10:00 గంటలకు మాడుగుల మండలం శంకరం గ్రామంలో, కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఉదయం 10:30 గంటలకు, మాడుగుల మండలం, తాటిపర్తి పంచాయతీ, లక్ష్మీ పేట గ్రామంలో ప్రహరీ గోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు మాడుగుల మండలం పాడేరు ఆర్ అండ్ బి రోడ్డు నుండి రామచంద్రపురం రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొంటారు. 11:30 గంటలకు, మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ కాశీ పురం గ్రామంలో ప్రహరి గోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మాడుగుల మండలం, సాగరం గ్రామంలో సిసి రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు, మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీ, రావిపాలెం నుండి సిరిపురం రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. కాబట్టి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేస్తారని విజ్ఞప్తి చేశారు.



## వినాయకుని దర్శించుకున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాస్

**పూతలపట్టు ఆగస్టు 02, జయ జయహే.**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామిని తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ మణి నాయుడు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

**చోడవరం ఆగస్టు 2 రెండు జయ జయహే**

చోడవరంలో గల స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో ఆషాడ బహుళ చవితి పురస్కరించుకొని ఆదివారం సంకట హర చతుర్థి సందర్భంగా సామూహిక శ్రీ లక్ష్మిగణపతి హోమం ఘనంగా జరిగింది. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు పంచామృత విషాకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం మండపంలో సామూహిక లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. అనేకమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనే హోమాన్ని తిలకించి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన కమలాకర్





**విశాఖపట్నం, ఆగస్టు 2:(జయ జయహే)**

బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకర రావు హాజరై విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమలాకర రావు మాట్లాడుతూ, బాల వికాస్ ఫౌండేషన్ భవనాన్ని మాజీ ఎంపీ స్వర్గీయ సబ్బం హరి ఆధ్వర్యంలో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం ఫౌండేషన్ అభివృద్ధి బాధ్యతలను నరవ ప్రకాష్ కు , నిర్వహణ బాధ్యతలను గోడి నరసింహాచారికి అప్పగించారని తెలిపారు. ప్రస్తుతం ఫౌండేషన్ విద్యార్థుల అభివృద్ధి కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయంగా ఉన్నాయని కొనియాడారు. పేద మరియు అవసరమైన పిల్లలకు విద్యా సహాయం అందిస్తూ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్న ఆయన, ప్రతి సంవత్సరం తన వంతుగా విద్యార్థులకు చేతనైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాష్, కస్తూరి వెంకటేశ్వరరావు, మేడ అప్పారావు, గోడి నరసింహాచారి, వేణుగోపాల్, మాడుగుల సత్యనారాయణ, చిన్న రమణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## మర్రివాడలో ఘనంగా "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం

### కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరణ..

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 03,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మర్రివాడ లో పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు మర్రివాడ పంచాయతీ, మర్రివాడ గ్రామంలో "ఇంటింటికి తెలుగుదేశం" డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత 2 ఏళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. 2 ఏళ్ల నమ్మకం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో యూనిట్ ఇన్చార్జ్ చడ్డ లోవరాజు, బూత్ కన్వీనర్ మొగ్గ భీమరాజు, వార్డు సభ్యురాలు మొగ్గ వెంకటలక్ష్మి , మర్రివాడ యూత్, మర్రివాడ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరకు రైతుల బకాయిలపై పరిశ్రమల శాఖ మంత్రి టి.జిని కలిసిన జనసేన రాజు

**చోడవరం ఆగస్టు 2 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆదివారం విజయవాడ వెలగపూడిలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ ని వారి కార్యాలయంలో చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి 2024--25 క్రషింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.30 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, బకాయిలు చెల్లించకపోవడంతో చెరకు రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ ప్రభుత్వం



నుంచి నిధులు విడుదల కాలేదనే కారణంతో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఆవేదనను ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, వారి ఆదేశాల మేరకు సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి టి.జి. భరత్ సమస్యకు సంబంధించిన వివరాలను సమగ్రంగా తెలుసుకుని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల బకాయిల చెల్లింపుల విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేసేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామప్పరావు, జానకిరామపురం పిఏసిఎస్ అధ్యక్షులు బలిజి మహారాజ్, పార్టీ సీనియర్ నాయకులు, చెరకు రైతులు పీలా మహేష్,ఆడారి రమణ మాలినాయుడు, పార్టీ నాయకులు చింతల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహో



## సమాజంలో మృగ్యమైపోతున్న

# మానవత్వం

(హెచ్.ప్రతాప్)

**ప్రపంచం సాంకేతికంగా ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, మానవీయ విలువలు అదే స్థాయిలో బలపడుతున్నాయా అనే ప్రశ్న నేడు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ విప్లవం, ఆధునిక జీవనశైలి మనిషి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నప్పటికీ, కరుణ, దయ, సహనం, పరస్పర గౌరవం, జీవితం పట్ల విలువ వంటి మానవీయ లక్షణాలు క్రమంగా క్షీణిస్తున్నాయనే భావన బలపడుతోంది. ఇటీవల వెలుగుచూసిన అనేక దారుణ ఘటనలు ఈ ఆందోళనను మరింత పెంచుతున్నాయి.**

జాతీయ నేర గణాంకాల ప్రకారం దేశంలో హత్యల సంఖ్య గతంతో పోలిస్తే కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ, ప్రతి సంవత్సరం వేలాది హత్యలు నమోదవుతున్నాయి. 2023లో దేశవ్యాప్తంగా 27,721 హత్య కేసులు నమోదు కాగా, 2024లో కూడా 27 వేలకుపైగా హత్యలు నమోదయ్యాయి. అలాగే 2023లో మహిళలపై 4.48 లక్షల నేరాలు, పిల్లలపై 1,77,335 నేరాలు నమోదయ్యాయి. పిల్లలపై నేరాలు ఏడాదిలోనే 9 శాతం కంటే ఎక్కువ పెరగడం ఆందోళన కలిగించే అంశం.

ఈ గణాంకాల వెనుక దాగి ఉన్న విషాదాలను పరిశీలిస్తే మానవత్వం ఎంతగా దెబ్బతింటోందో అర్థమవుతుంది. పశ్చిమ బెంగాల్‌లో 11 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. బాలల రక్షణ సమాజం యొక్క ప్రాథమిక బాధ్యత అయినప్పటికీ, అమాయక చిన్నారులే అత్యంత దారుణ నేరాలకు బలవుతున్న పరిస్థితి ఆందోళనకరం. బాలికలపై లైంగిక దాడులు ఇంకా తీవ్రమైన సామాజిక సవాలుగానే కొనసాగుతున్నాయని ఈ ఘటన గుర్తు చేసింది.

బెంగళూరులోని ఒక కార్పొరేట్ సంస్థ ప్రాంగణంలోని డేకేర్ కేంద్రంలో చిన్నారులపై దుర్వ్యవహారం జరిగిందనే ఆరోపణలు కూడా సమాజాన్ని కలచివేశాయి. ప్రేమ, ఆప్యాయత అందాల్సిన ప్రదేశంలో భయం, నిర్లక్ష్యం, హింస కనిపించడం కేవలం ఒక సంస్థ వైఫల్యం కాదు; పిల్లల పట్ల మన సామాజిక బాధ్యత తగ్గిపోతోందనే సంకేతం.

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన శ్రద్ధా వాకర్ హత్య కేసు మానవత్వం



ఎంతటి దిగజారుడు స్థితికి చేరవచ్చో చూపించింది. దర్యాప్తు సంస్థల ఆరోపణల ప్రకారం అత్యంత సన్నిహిత సంబంధంలో ఉన్న వ్యక్తి చేసినట్లు ఆరోపించబడిన ఈ హత్య, అనంతరం జరిగినట్లు చెప్పబడిన అమానుష చర్యలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ కేసు న్యాయ విచారణలో ఉన్నందున తుది తీర్పు న్యాయస్థానాలదే అయినప్పటికీ, మానవ సంబంధాల్లో విశ్వాసం, గౌరవం, సహనం కోల్పోతే ఎంతటి విషాదాలు సంభవించవచ్చో ఈ సంఘటన గుర్తు చేసింది.

ఈ మూడు సంఘటనలు వేర్వేరు నేపథ్యాల్లో జరిగినప్పటికీ ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. పిల్లలపై హింస, సంరక్షణలో క్రూరత్వం, అత్యంత సన్నిహిత సంబంధాల్లోనే అమానుష హత్యలు---ఇవి సమాజంలో మానవీయ విలువలు క్షీణిస్తున్నాయనే సంకేతాలు. భౌతిక విజయాల కోసం పరుగు, కుటుంబ బంధాల బలహీనత, మానసిక ఒత్తిళ్లు, మత్తు పదార్థాల దుర్వినియోగం, హింసాత్మక వినోదం ప్రభావం, సామాజిక మాధ్యమాల్లో అసంవేదనశీలత వంటి అనేక అంశాలు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి.

ఈ ధోరణిని మార్చాలంటే కుటుంబమే మొదటి పాఠశాల కావాలి. పిల్లలకు మార్కులు, ఉద్యోగాలు మాత్రమే కాకుండా దయ, క్షమ, సహనం, మహిళల పట్ల గౌరవం, ఇతరుల బాధను అర్థం చేసుకునే మనస్తత్వాన్ని చిన్ననాటి నుంచే అలవాటు చేయాలి. పాఠశాలల్లో నైతిక విద్య, జీవన నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ, డిజిటల్ బాధ్యత వంటి అంశాలను బలోపేతం చేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడం కూడా అవసరం.

అదే సమయంలో పిల్లల సంరక్షణ కేంద్రాలపై క్రమం తప్పని తనిఖీలు, మహిళలు, చిన్నారుల భద్రతకు కఠిన చట్టాల సమర్థ అమలు, వేగవంతమైన దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు, బాధితులకు మానసిక సహాయం వంటి చర్యలు మరింత బలోపేతం కావాలి. మీడియా, సామాజిక మాధ్యమాలు నేరాలను సంచలనంగా కాకుండా సామాజిక బాధ్యతతో చర్చించాలి. మత, విద్యా, స్వచ్ఛంద సంస్థలు మానవీయ విలువలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

సమాజ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు. ఒక చిన్నారి భయంలేకుండా జీవించగలగడం, మహిళ గౌరవంగా జీవించగలగడం, మనుషులు పరస్పరం విశ్వాసంతో మెలగగలగడం కూడా నిజమైన అభివృద్ధికి ప్రమాణాలు. మానవత్వం, కరుణ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను కుటుంబం, విద్య, సమాజం, పరిపాలన కలిసి పునరుద్ధరించినప్పుడే రాబోయే తరాలకు మరింత సురక్షితమైన, మానవీయ సమాజాన్ని అందించగలుగుతాం.

## కుంభకర్ణుడు-విశ్వాసం, మనస్సాక్షి, మరియు

# తప్పుగా అర్థం చేసుకున్న కర్తవ్యబోధ

**రామాయణంలోని అత్యంత ఆసక్తికరమైన, తాత్వికంగా లోతైన పాత్రలలో కుంభకర్ణుడు ఒకడు. రావణుని తమ్ముడిగా అతడు అపారమైన శారీరక బలం కలిగిన యోధుడే కాదు; నిజాయితీ, ధర్మబోధ, కర్తవ్యనిబద్ధత, మరియు అంతరంగ సంఘర్షణకు ప్రతీక కూడా. అతని వ్యక్తిత్వం మనిషి జీవితంలో విశ్వాసం, కుటుంబ బంధం, మరియు మనస్సాక్షి మధ్య జరిగే సంఘర్షణను ప్రతిబింబిస్తుంది.**




### రావణునికి ధర్మబోధ చేసిన తమ్ముడు

రావణుడు సీతాదేవిని అపహరించి రామునితో వైరం పెంచుకున్నప్పుడు, కుంభకర్ణుడు తన అన్నకు ఎలాంటి భయం లేకుండా సత్యాన్ని చెప్పాడు. "సీతను అపహరించడం అధర్మం. ఆమెను తిరిగి అప్పగించడమే ధర్మం; లేకపోతే లంక వినాశనం తప్పదు" అని స్పష్టంగా హెచ్చరించాడు. ఈ సంఘటన అతని నైతికతకు, ధర్మవివేకానికి నిదర్శనం.

### విశ్వాసం -- ధర్మం మధ్య సంఘర్షణ

కుంభకర్ణుడి జీవితంలో అత్యంత విషాదకరమైన అంశం అతని అంతరంగ సంఘర్షణ. రావణుని చర్యలు తప్పని తెలిసినా, అన్న పట్ల ఉన్న ప్రేమ, కుటుంబ బంధం, మరియు కర్తవ్య భావం అతడిని యుద్ధరంగంలోకి తీసుకెళ్లాయి. అతడు యుద్ధం చేసింది ధర్మం కోసం కాదు; తన కుటుంబానికి అండగా నిలవాలనే భావంతో. ఈ సంఘర్షణ అతడిని మహోన్నతమైన, కానీ విషాదభరితమైన పాత్రగా నిలబెడుతుంది.

### మనస్సాక్షి చెప్పిన మాటను వినలేకపోయిన యోధుడు

కుంభకర్ణుడి మనస్సాక్షి ఎప్పటికప్పుడు రావణుని మార్గం అధర్మమని హెచ్చరించింది. అయినప్పటికీ, అతడు తన



అన్నను విడిచిపెట్టలేకపోయాడు. తనకు సత్యం తెలిసినా, బంధం కారణంగా దానికి వ్యతిరేకంగా నడవాల్సి వచ్చింది. ఇదే అతని జీవితంలోని అత్యంత మానవీయమైన, హృదయాన్ని కదిలించే అంశం.

### నేటి సమాజానికి కుంభకర్ణుడి సందేశం

ఈ సంఘటన నేటి సమాజంలో కూడా ఎంతో ప్రాసంగికం. ఉద్యోగులు, రాజకీయ నాయకులు, సంస్థలలో పనిచేసే అధికారులు, కుటుంబ సభ్యులు---చాలామంది న్యాయం మరియు నిబద్ధత మధ్య ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటారు. అన్యాయం జరుగుతోందని తెలిసినా, వ్యక్తిగత బంధాలు లేదా సంస్థ పట్ల విశ్వాసం కారణంగా మౌనం వహించే పరిస్థితులు తరచుగా కనిపిస్తాయి. అలాంటి ప్రతి సందర్భంలో కుంభకర్ణుడి జీవితం మనకు ఒక హెచ్చరికగా నిలుస్తుంది.

### శక్తి ఉన్నా, అంతరంగ శాంతి కోల్పోయిన వీరుడు

యుద్ధరంగంలో కుంభకర్ణుడు అజేయుడిగా నిలిచాడు. అతని శౌర్యం, పరాక్రమం అసాధారణమైనవి. కానీ అతని మనసులో మాత్రం ప్రశాంతత లేదు. ఎందుకంటే తాను ధర్మానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నాననే నిజం అతడిని లోలోపల బాధించింది. శారీరక విజయం కన్నా, నైతిక ప్రశాంతత గొప్పదని అతని జీవితం తెలియజేస్తుంది.

### మరణం కాదు, నైతిక విముక్తి

రాముని చేతిలో కుంభకర్ణుడి మరణం కేవలం ఒక యోధుని పతనం మాత్రమే కాదు; అది ఒక నైతిక విముక్తి కూడా. అతడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పటికీ, ధర్మం ఏదో తన హృదయంలో ఎప్పుడూ తెలుసుకున్నాడు. అందుకే రాముడు కూడా అతని ధైర్యాన్ని, వీరత్వాన్ని గౌరవించాడు. కుంభకర్ణుడు శత్రువుగా కాకుండా, ధర్మసంకటంలో చిక్కుకున్న మహాయోధుడిగా నిలిచిపోయాడు.

అంధ విశ్వాసం కాదు, ధర్మబద్ధమైన విశ్వాసం అవసరం

కుంభకర్ణుడి జీవితం మనకు ఒక శాశ్వతమైన సత్యాన్ని తెలియజేస్తుంది. శక్తి, ప్రతిభ, విశ్వాసం, కర్తవ్యబోధ---ఇవన్నీ విలువైనవే. కానీ అవి ధర్మం అనే పునాదిపై నిలబడినప్పుడే సమాజానికి మేలు చేస్తాయి. అంధ విశ్వాసం, తప్పుగా అర్థం చేసుకున్న కర్తవ్యబోధ వ్యక్తిని మాత్రమే కాదు, సమాజాన్ని కూడా వినాశనానికి నెడతాయి.

### ముగింపు

కుంభకర్ణుడు మనకు చెప్పే శాశ్వత సందేశం ఒక్కటే---

"విశ్వాసం గొప్పది; కానీ అది ధర్మానికి అనుగుణంగా ఉన్నప్పుడే మహోన్నతమవుతుంది."

కుటుంబం, ఉద్యోగం, సంస్థ, లేదా దేశం పట్ల మనం చూపే నిబద్ధత ఎప్పుడూ న్యాయం, సత్యం, మరియు మనస్సాక్షికి విరుద్ధంగా ఉండకూడదు. ధర్మాన్ని తెలుసుకుని కూడా బంధాలకు లొంగిపోవడం కుంభకర్ణుడి విషాదం. ఆ తప్పును పునరావృతం చేయకుండా ఉండటమే అతని జీవితం మనకు అందించే గొప్ప పాఠం.

ధర్మం పట్ల నిజాయితీ---అదే కర్తవ్యానికి మించిన విలువ.

ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు



# గాజాలో చివరికి శాంతి కిరణాలు...

(ప్రతాప్)

**దాదాపు మూడు సంవత్సరాలుగా ప్రపంచాన్ని కలవరపరిచిన గాజా యుద్ధం ముగింపు దశకు చేరినట్లు కనిపిస్తోంది. హమాస్ తన ఆయుధాలను అంతర్జాతీయ పర్యవేక్షణలో అప్పగించేందుకు అంగీకరించడం, ఇజ్రాయెల్ దశలవారీగా గాజా నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవడానికి రూపొందిన ప్రణాళిక ప్రపంచానికి కొంత ఊరటనిచ్చింది. అయితే ఈ ఒప్పందం పూర్తిగా అమలైతేనే శాశ్వత శాంతి సాధ్యమవుతుందని అంతర్జాతీయ సమాజం భావిస్తోంది.**



ఈ రక్తపాతం 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై ఆకస్మిక దాడి చేయడంతో ప్రారంభమైంది. వందలాది రాకెట్లు ప్రయోగించడం, సరిహద్దు దాటి దాడులు నిర్వహించడం, వందలాది మందిని బందీలుగా తీసుకెళ్లడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. దీనికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్ గాజాపై విస్తృత స్థాయిలో వైమానిక దాడులు, భూసైన్య చర్యలు ప్రారంభించింది. అప్పటి నుంచి యుద్ధం నిరంతరంగా కొనసాగుతూ మధ్యప్రాచ్యాన్ని అస్థిరతలోకి నెట్టింది.

ఈ యుద్ధం దాదాపు 34 నెలల పాటు కొనసాగింది. అనేకసార్లు కాల్పుల విరమణ ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి



ఎక్కువకాలం నిలవలేదు. చివరకు అంతర్జాతీయ మధ్యవర్తిత్వం, ఐక్యరాజ్యసమితి మద్దతు, అమెరికా ఆధ్వర్యంలో రూపొందిన తాజా శాంతి ప్రణాళికతో హమాస్ నిరాయుధీకరణకు సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనికి ప్రతిగా గాజా పాలనను కొత్త పౌర పరిపాలనకు అప్పగించడం, ఇజ్రాయెల్ సైన్యం దశలవారీగా వెనక్కి వెళ్లడం, పునర్నిర్మాణానికి ప్రపంచ



దేశాలు సహకరించడం వంటి అంశాలు ప్రతిపాదించబడ్డాయి.

ఈ యుద్ధం మానవాళిపై మిగిల్చిన గాయాలు అత్యంత విషాదకరమైనవి. వివిధ అంతర్జాతీయ అంచనాల ప్రకారం లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వేలాది పిల్లలు అనాథలయ్యారు. పదివేలల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస భవనాలు, విద్యుత్ వ్యవస్థలు, నీటి సరఫరా మౌలిక వసతులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. గాజాలోని భవనాలలో అధిక భాగం శిథిలాలుగా మారిపోయింది.

ఆర్థిక పరంగా కూడా ఈ యుద్ధం అపార నష్టాన్ని మిగిల్చింది. గాజా పునర్నిర్మాణానికి వందల బిలియన్ డాలర్ల వ్యయం అవసరమవుతుందని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచ చమురు రవాణా, సముద్ర వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం, ఆహార సరఫరా వ్యవస్థలపై కూడా ఈ యుద్ధం తీవ్ర ప్రభావం చూపింది. మధ్యప్రాచ్య అస్థిరత కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేకసార్లు ఒత్తిడిని ఎదుర్కొంది.

భారత్‌పై కూడా ఈ యుద్ధ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, ఎర్ర సముద్రం మార్గంలో నౌకాయాన అంతరాయాలు, దిగుమతి-ఎగుమతుల వ్యయం పెరగడం వంటి పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థపై భారం మోపాయి. అయినప్పటికీ భారత్ శాంతి, చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిరంతరం పునరుద్ఘాటించింది.

అయితే ప్రస్తుతం ప్రకటించిన శాంతి ప్రణాళిక విజయవంతం కావాలంటే హమాస్ పూర్తిస్థాయిలో నిరాయుధీకరణను అమలు చేయడం, ఇజ్రాయెల్ తన ఉపసంహరణ హామీలను నిలబెట్టుకోవడం, అంతర్జాతీయ పర్యవేక్షణ సమర్థంగా కొనసాగడం అత్యంత కీలకం. పరస్పర అనుమానాలు తొలగి విశ్వాసం పెరిగితేనే గాజాలో శాశ్వత శాంతి నెలకొంటుంది. యుద్ధాలు విధ్వంసాన్ని మాత్రమే సృష్టిస్తాయి; సంభాషణ, సహనం, పరస్పర గౌరవమే శాంతికి శాశ్వత పునాదులు. గాజా విషాదం ప్రపంచానికి ఇదే గొప్ప పాఠం.

# అతి పెద్ద జాతీయ జెండా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



## త్రివర్ణ పతకం వెంట రెండు కిలోమీటర్లు నడిచిన పెద్దలు

## జెండా ఊపి ర్యాలీ ప్రారంబించిన ఎంపీ పుట్టా మహేష్

**జంగారెడ్డిగూడెం-జయ జయహే**

జంగారెడ్డిగూడెం యావత్తు దేశ భక్తి తో వూగి పోయింది.మన జాతీయజెండా రూపకర్త తెలుగువ్యక్తి పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు ఆధ్వర్యంలోజెడ్ పి టిసి పొల్నాటి బాబ్జి, నాయకులు రాజాన పండు, దాకారపు కృష్ణ,పాలపర్తి శ్రీనివాస్ ఇతర సంస్థల సహకారంతోఆదివారం 2 కిలోమీటర్ల జాతీయజెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, జెడ్పిటిసి పొల్నాటి బాబ్జి తదితరులు ఆద్యంతం రెండుకిలోమీటర్లు నడిచి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.ఈసందర్భంగా ఎంపీ మహేష్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య 150 వ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇంత అద్భుతంగా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. దేశభక్తి పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని తాను పాల్గొనటం గర్వం గా వుంది అన్నారు.పింగలికి ఘన నివాళి అర్పిస్తున్నాం అన్నారు.కార్యక్రమం లో మరో అతిధిగా పాల్గొన్న డి సి సి బి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ యువతకు దేశభక్తి, పింగళి వెంకయ్య సేవలు తెలియజేసేలా పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.దాసరి శేషు మాట్లాడుతూ మన దేశానికి ఒక జెండా ఉండాలి అని 19 ఏళ్లకే



ఆలోచన చేసి అనేక ప్రయత్నాలు చేసి విజయ-ంవాడలో నిర్వహించిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీలో గాంధీజీ ఆదేశాలతో మూడు రంగుల జెండా రూపొందించారని అలాంటి మహనీయుని నివాళి అర్పిస్తూ ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు

# స్నేహబంధం సేవ శక్తిగా మారాలి

**అనకాపల్లి జయ జయహే**

నైపుణ్యానికి వయసుతో పనిలేదు స్నేహబంధం సేవ శక్తిగా మారాలని వినియోగదారుల రక్షణ ఆర్టిఐ చట్టాల ఇన్ఫ్లుయెన్స్ సర్ కాంద్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా నిలదొక్కుకోవాలంటే నైపుణ్యాల అప్ గ్రేడేషన్ అవసరమని అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో కర్రీ జగన్నాధ రావు ఏసీ ఫంక్షన్ హాల్ లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు మున్సిపల్ గవరపాలెం హై స్కూల్ 1994- 95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది అక్కడ ఏర్పాటు చేసిన రక్తదానం కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో క్రియేటర్ గా లీడర్ గా ఎదగాలనుకునే ఔత్సాహకులకు కెరియర్ గైడెన్స్ దిశా నిర్దేశం చేస్తుందన్నారు సృజనాత్మకత కు వయసుతో పనిలేదని ఏ రంగంలో ఉన్న డిజిటల్ టూల్స్ ఆర్ట్ అఫీషియల్ ఇంటెలిజెన్స్ మొదల గు ఆధునిక సాంకేతిక సాధనాలపై అవగాహన పెంచుకోవాలని మోస పద్ధతులకు స్వస్తి పలికి భిన్నంగా ఆలోచించడం ప్రారంభించాలి అన్నారు నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు జారీ చేయడం కాదు బృందాన్ని స్ఫూర్తివంతంగా నడిపించడం దీనికి సాఫ్ట్ స్కిల్స్ ఎంతో కీలకమని ఒకే ఆలోచనలో ఉన్న వ్యక్తులతో నెట్వర్కింగ్ పెంచుకోవాలని ఆయన హేతువు పలికారు స్నేహితుల కలయిక పాత జ్ఞాపకాలు నెమరు వేసుకోవడానికి పరిమితం కాకూడదు ప్రజా సమస్యల పరిష్కారం ఇతరులకు సహాయము ఆర్టిఐ వినియోగదారుల హక్కులు ప్రజా ప్రయోజన చట్టాలు వినియోగ హక్కులు



సాధనలో ముందుండాలని వ్యక్తిగత విజయాన్ని సమాజ సేవతో ముడిపెట్టినప్పుడే జీవితం సార్థకం అవుతుందని స్నేహితులు చేతులు కలిస్తే ఒక పెద్ద సేవ శక్తి పుడుతుందని అదే అభివృద్ధి చెందిన సమాజానికి నిజమైన పునాది అని ఆయన పేర్కొన్నారు సాంకేతిక విప్లవం మనుషులను భౌతికంగా దగ్గర చేసిన మనసులను కలిపేది మాత్రం పాఠశాల స్థాయిలో మొదలైన స్వచ్ఛమైన స్నేహమే అని ఆయన అభిప్రాయపడ్డారు ఒకే వేదిక పైకి తీసుకొచ్చిన పూర్వ విద్యార్థుల బృందాన్ని కాంద్రేగుల వెంకటరమణ అభినందించారు ఈ సభ అనంతరం టెన్త్, ఇంటర్, ఐఐటి, మెడిసిన్ విభాగాల్లో ప్రతిబి కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు జ్ఞాపికలు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ విల్లూరి అప్పలనాయుడు సమావేశం అధ్యక్షత వహించిన కే యం నాయుడు, వైద్యులు సరగడం పవన్, పి అనిల్ కుమార్, అమ్మ బ్లడ్ బ్యాంక్ నటరాజ్ ఆప్టికల్స్ కంటి వైద్యులు 94 - 95 బ్యాచ్ విద్యార్థులు విల్లూరి రాముడు, కాంద్రేగుల శశి, కొణతాల సంతోష్, కర్రీ భాను తదితరులు పాల్గొన్నారు

# కె కోటపాడులో ఇంటింటికి తెలుగుదేశం

**మాడుగుల (జయ జయహే)**

కె కోటపాడు మండలం వారాడ గ్రామంలో రెండు సంవత్సరాల పూర్తిచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ , మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు ఇంటింటా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాసులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను వివరించి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా వినియోగించుకుంటున్నారన్న విషయాలపై ప్రజల వద్ద నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా . కూటమి ప్రభుత్వం చెప్పిన దానికంటే అధికంగా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తుందని స్వయంగా చెబుతున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మెగా డీఎస్సీ,



స్త్రీ శక్తి , 3గ్యాస్ సిలిండర్ల ఉచితం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో, డ్రైవర్ సేవలో, మత్స్యకార సేవలో, చేనేత సేవలో, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ వంటి వాటి ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ఏ ఇంటికెళ్లినా ఆ ఇంట్లో రెండు మూడు పథకాల రూపంలో ఆర్థిక సాయం ప్రభుత్వ నుంచి పొందిన విషయాలను ప్రజలే చెబుతున్నారని తెలిపారు . ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బండారు సత్యనారాయణ, నీటి సంఘం డైరెక్టర్లు చల్ల కమలాకర్, లెక్కల సూర్యనారాయణ,కోశాధికారి దొగ్గ నాగరాజు, బూతు అధ్యక్షులు అల్లు సోమి నాయుడు, లెక్కల సత్యవేణి,బొత్స అప్పారావు, సిరికి దేవుడు బాబు,లెక్కల సత్తిబాబు, జుత్తుక రాజు, దొగ్గ గణపతి, పాల్గొన్నారు

# ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

**విజయనగరం, ఆగస్టు 2: (జయ జయహే )**

అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ నడక మైదానంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఏ. తిరుపతిరావు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఎస్. ప్రకాష్ రావు మాస్టారు మరియు ప్రత్యేక అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.వి.జి. శంకరరావు హాజరై స్నేహబంధాల విలువను వివరించారు. స్నేహం అనేది మనుషులను కలిపే గొప్ప బంధమని, పరస్పర ప్రేమ, నమ్మకం, సహకారంతో సమాజంలో ఐక్యతను పెంపొందించవచ్చని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులందరూ పరస్పరం ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకుని, ఒకరికొకరు చాక్లెట్లు పంచుకుంటూ స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ప్రత్యేక అతిథి డాక్టర్ డి.వి.జి. శంకరరావు



ప్రతి క్లబ్ సభ్యునికి స్వయంగా ఫ్రెండ్షిప్ బ్యాండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఏ. తిరుపతిరావు కార్యక్రమానికి హాజరైన సభ్యులు, వాకర్స్ మరియు అతిథులందరికీ చాక్లెట్లు పంపిణీ చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, వాకర్స్, పెద్దలు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చివరగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, సభ్యులకు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ క్లబ్ అధ్యక్షులు సి. హెచ్. రమణ కృతజ్ఞతలు తెలిపారు.



# కొయ్యూరు మండలంలో రోడ్డు ప్రమాదం-యువ రైతు మృతి

## రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు..

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 03,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం తోటలూరు గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పై ఈ రోజు సాయంత్రం సుమారు 04.00 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువ రైతు మృతి చెందాడు.రావణపల్లి గ్రామానికి చెందిన పాడి రాజా (25), తండ్రి సత్తిబాబు, తన హీరో స్ప్లెండర్ బైక్ పై రావణపల్లి వైపు వెళ్తుండగా, తోటలూరు వద్ద ఆకస్మికంగా యూ-టర్న్ తీసే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో కేడీపేట వైపు నుంచి వస్తున్న బైక్‌ను కొర్రు లక్ష్మణ్ (28), ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో పాడి రాజాకు తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు కలిసి కేడీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న వెంటనే కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో స్వల్ప గాయాలైన కొర్రు లక్ష్మణ్ మరియు గుడాలి సింహాచలం లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహనదారులు యూ-టర్న్‌లు తీసే సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలను తప్పనిసరిగా గమనించాలి. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు సంభవిస్తాయని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్లు ధరించాలని కొయ్యూరు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# నషా ముక్త్ యువ ప్రచారంలో యువత చురుకైన భాగస్వామ్యం

**గుంటూరు, ఆగస్టు 2, జయ జయహే**

మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. నషా ముక్త్ యువ ప్రచారంలో భాగంగా శనివారం గుంటూరులోని భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్, గుంటూరు మరియు ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి) సంయుక్త ఆద్వర్యం లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశంలోని యువతను వర్చువల్ విధానంలో ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యువత బాధ్యతలపై సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి మేరా యువ భారత్ , గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ఏ. సంతోష్ కుమారి పాటు, అధికారులు, కళాశాల సిబ్బంది మరియు యువత పాల్గొన్నారు.ఈ సందర్భంగా నషా ముక్త్ యువ ప్రచారంలో చురుకుగా పాల్గొన్న యువతకు పాల్గొనడం ధృవీకరణ పత్రాలు అందజేశారు. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం కోసం యువతను భాగస్వాములను చేస్తూ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్, గుంటూరు ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు




# జాతీయ జెండా రూపకర్త పింగళికి జేజేలు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

**టెక్కలి ఆగస్టు 2 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పింగళి వెంకయ్య 150 జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు, జాతీయ జెండా రూపకల్పన మహోన్నత బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ కు చెందిన పింగళి వెంకయ్య సారధ్యంలో రూపుదిద్దుకోవడం చాలా గొప్ప విషయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి గోవిందమ్మ పేర్కొన్నారు. ఎందరో మహానుభావులు చరిత్రలో మిగిలిపోతారని గొప్ప ప్రతిష్టాత్మక అరుదైన అవకాశం ఆంధ్ర ప్రాంతానికి కలగడం గొప్ప అవకాశం మని పింగళి వెంకయ్య జయంతి జరుపుకోవడం హర్షించదగ్గ విషయమని కళాశాల అధ్యాపకులు పలువురు కొనియాడారు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి గోవిందమ్మ అధ్యక్షత వ హించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి సతీష్ కుమార్ వందేమాతరం ఉద్యమ స్ఫూర్తి గూర్చి సమగ్రంగా విద్యార్థులకు వివరించారు, పింగళి వెంకయ్య జయంతి వేడుకల్లో చరిత్ర అధ్యాపకులు పి సి హెచ్ వెంకటేశ్వరరావు, రాజకీయ శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్ ధర్మారావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న ఛలో గుంటూరు

## చింతపల్లి ఏపీసీపీఎసఈఏ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## సీపీఎస్ రద్దు చేయాలి - ఓపీఎస్ ఇవ్వాలి" నినాదంతో ఉద్యమానికి సిద్ధం



**విశాఖపట్నం, ఆగష్టు 2, జయ జయహే :**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో నూతన ఏపీసీపీఎసఈఏ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు మోరి.మోహన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాగిన వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాంబాబు, చింతపల్లి మండల ప్రెసిడెంట్ కిత్లంగి. ప్రసాద్, మాసాడ.రాంబాబు ఆధ్వర్యంలో చింతపల్లి మండలంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో సింహాచలంను చింతపల్లి మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు మోరి.మోహన్ బాబు మాట్లాడుతూ "2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ప్రతి ఉపాధ్యాయుడి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉందన్నారు. రిటైర్ అయ్యాక రూ. 3000 పెన్షన్ కూడా రాదని, మన హక్కు సాధించుకునే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. చింతపల్లి మండలం నుండి అత్యధిక మందిని సెప్టెంబర్ 1న చలో గుంటూరు కు తరలిస్తాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ప్రధాని వర్చువల్ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యార్థులు

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు








**విశాఖపట్నం, ఆగష్టు 2, జయ జయహే :**

ప్రధానమంత్రి చేపట్టిన "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత"(మాదకద్రవ్యాల రహిత యువతతో వికసిత్ భారతం) జాతీయ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం విశాఖలోని సత్యసాయి విద్యావిహార్‌కు దక్కింది. రాష్ట్రానికే కాకుండా యావత్ శ్రీ సత్యసాయి కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ జాతీయ వర్చువల్ కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని విశాఖ శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు పొందారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండటంతో పాటు తమ కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజంలో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కల్పించే సామాజిక మార్పుకు రాయబారులుగా యువత ఎదగాలనే లక్ష్యంతో ఈ జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. శ్రీ సత్య సాయి విద్యా విహార్ స్కూలు ప్రాంగణం నుంచే ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్న విద్యార్థులు, దేశవ్యాప్తంగా వేలాది మంది యువతతో కలిసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన వికసిత భారత నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశాభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించే విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన యువతే వికసిత్ భారత్‌కు పునాది అనే సందేశాన్ని బలంగా చాటిచెప్పారు. అనంతరం జరిగిన సభలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ పూర్వ ప్రిన్సిపాల్ అయ్య కౌసల్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మాదకద్రవ్య రహిత భారతానికి యువత రాయబారులుగా మారాలని, మానవ విలువలను ఆచరిస్తూ ఉత్తమ వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నిస్వార్థ సేవాభావంతో వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి విద్యా విహార్ గవర్నింగ్ బాడీ సభ్యులు బి. శ్రీదేవి, పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, వి.ఆర్. నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి చేకూరి వరలక్ష్మి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## వేడుకగా శ్రీ చెంగల్ రాయుల ధ్వజారోహణం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 02,జయ జయహే**



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం శ్రీ చంగల్రాయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం రెండవ రోజు ఉదయం ధ్వజ రోహణం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారిని వెండి అంబారి వాహనం పై విహారింప చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొట్టె సాయి,సభ్యులు, అధికారులు,పాల్గొన్నారు.

## అనకాపల్లి రైతు బజార్ మార్కెట్లో ప్రభుత్వ సన్న బియ్యం అమ్మకాలు

**అనకాపల్లి జయ జయహే**



స్థానిక రింగ్ రోడ్ లో గల ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గల రైతుబజార్ మార్కెట్లో సోమవారం నుండి బి పి టి సన్న బియ్యం తక్కువ ధరకు కేజీ 52 రూపాయ లకే 10 కేజీల వరకు అందించడం జరుగుతుందని మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సివిల్ సప్లై శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ వారి ఆదేశాలతో ఏర్పాటు చేయడం జరుగుతున్నది ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు గోవింద సత్యనారాయణ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరుగుతున్నది

## మన స్నేహం వృక్షాలతో భూమితో ప్రకృతి వనరులను కాపాడుకుందాం..

# భూమాతను పరిరక్షిద్దాం: జె వి రత్నం





**విశాఖపట్నం (జయ జయహే)**

మన స్నేహం వృక్షాలతో భూమితో అని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. విశాఖ నగరంలో తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్కన రైల్వే గెస్ట్ హౌస్ దగ్గర ఉన్న 150 సంవత్సరాల మర్రిమానుకు విత్తనాల రాఖీలను కట్టి ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. వనమాలి, సిటిజి, ఐ ఐ ఏ ఎం, యాక్షన్ ఎయిడ్, రోటరీ కపుల్స్ తదితర సంస్థలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రత్నం మాట్లాడుతూ ఈరోజు నుంచి ఆగస్టు 28 వరకు వృక్షాబంధన దినోత్సవాలు నిర్వహించాలని కోరుతూ, తాము విత్తనాల రాఖీలు తయారు చేయడం, రక్షాబంధన కార్యక్రమాలు నిర్వహించడం, తాటి పండ్లతో తాటి వనాల పెంచేందుకు కృషి చేస్తామన్నారు. గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు విత్తనాల రాఖీ లను ప్రోతసహిస్తామన్నారని రత్నం వివరించారు. వనమాలి సిటిజి అడ్మిన్ మళ్ళ సరిత మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడుకుందాం, భూమాతను పరిరక్షిద్దాం అని అన్నారు. వందల సంవత్సరాల క్రిందట బిష్ణోయి తెగ చెట్లకు పవిత్ర దారాలు కట్టే కాపాడారన్నారు. వందల ఏళ్ల నాటి చెట్లను కాపాడటానికి మహిళలు ఎందరో బలయ్యారు అని వివరించారు. అందుకే మనందరం చెట్లను కాపాడుకోవాలని, అడవులను పరిరక్షించాలని కోరారు. ఐఐఎం ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న శీతోష్ణస్థితిని దృష్టిలోనికి తీసుకుని అడవులను కాపాడుకుందాం, తాటి వనాలను పెంచుదాం, తాటితోపులను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఈ రోజు నుంచి ఆగస్టు 28 వరకు నిర్వహించే వృక్షాబంధన్ దినోత్సవాలలో తమ విద్యార్థులనూ భాగస్వాములు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ కపుల్స్ ప్రతినిధులు శోభన ప్రకాష్ , యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, మేంగోమేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



## యార్లగడ్డకు సిలికానాంధ్ర సత్కారం

**కాలిఫోర్నియా:**

రాజ్యసభ మాజీ సభ్యుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను కాలిఫోర్నియాలోని ఓక్‌ల్యాండ్‌లో జరిగిన సిలికానాంధ్ర సంస్థ రజతోత్సవ వేడుకల్లో భాగంగా సత్కరించారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయానికి యార్లగడ్డ 14వేల పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఈ విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేరు పెట్టారు. సిలికానాంధ్ర సంస్థతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ గుర్తుచేసుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఐటీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను కూడా సన్మానించారు. సిలికానాంధ్ర సంస్థ వ్యవస్థాపకుడు ఆనంద్ కూచిభొట్ల చేతుల మీదుగా ఈ సత్కారం జరిగింది.



## ప్రధాని మోడీకి వీడ్కోలు పలికిన వన్నెంరెడ్డి

**విశాఖపట్నం, ఆగష్టు 2, జయ జయహే :**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ వీడ్కోలు పలికారు. షఈ సందర్భంగా మోడీ పలకరించిన మధుర క్షణాలు తన జీవితంలో గుర్తుండిపోతాయని సతీష్ కుమార్ పేర్కొన్నారు. విశ్వవిఖ్యాత నాయకులుగా భారతదేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తూ 144 కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేర్చుతున్న మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో కలవడం ఆనందంగా ఉందన్నారు. వీడ్కోలు సందర్భంగా ఆయన ఆప్యాయతగా పలకరించిన మధుర క్షణాలు నా జీవితంలో గుర్తుండిపోతాయి.



## నేడు కలెక్టరేట్‌లో పీజీఆరఎస్, రెవెన్యూ క్లినిక్

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖపట్నం, ఆగస్టు 2, జయ జయహే**

విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆరఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, మీ సేవ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

# సంక్షోభంలో బత్తాయి సాగు....
# అస్థిత్వం కోసం నల్గొండ రైతు పోరాటం

**ఒకప్పుడు దేశానికే దిక్సూచిగా నిలిచిన నల్గొండ బత్తాయి...**

**నేడు విధానపరమైన వైఫల్యాలు, మార్కెట్ దోపిడీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్థిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది**

**హైదరాబాద్, ఆగస్టు 2 (విశాల తెలంగాణ)**

ఒకప్పుడు నల్గొండ అంటే బత్తాయి... బత్తాయి అంటే నల్గొండ అనే స్థాయిలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ నేల నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వేలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా, లక్షలాది వ్యవసాయ కార్మికులకు ఉపాధి వనరుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు నేడు అస్తిత్వ పోరాటం చేస్తోంది. ఒకప్పుడు రైతు ఇంట్లో సిరులు కురిపించిన ఈ పంట, ఇప్పుడు అప్పులు, నష్టాలు, నిరాశలకు ప్రతీకగా మారింది.

ఇది కేవలం ఒక పంట సంక్షోభం కాదు. వ్యవసాయ విధానాల్లోని లోపాలు, మార్కెట్ వ్యవస్థ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతు పట్ల పాలకుల నిరాసక్తతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన పంట క్షీణిస్తుంటే, దాని ప్రభావం రైతు కుటుంబాలకే పరిమితం కాదు. గ్రామీణ జీవన విధానంపైనా, ఉపాధిపైనా, రాష్ట్ర ఉద్యాన రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది.



**వైభవం నుంచి పతనం వరకు...**

ఒకప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 4.5 లక్షల ఎకరాలకు పైగా బత్తాయి సాగు విస్తరించి ఉండేది. దేశంలోనే నాణ్యమైన బత్తాయి ఉత్పత్తికి ఈ ప్రాంతం చిరునామాగా నిలిచింది. దేశంలోని పలు రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఇక్కడి నుంచి బత్తాయి ఎగుమతులు జరిగేవి.

ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ఈ రంగం, నేడు 40 వేల ఎకరాల లోపే



పరిమితమవడం ఉద్యాన రంగానికి తీవ్రమైన హెచ్చరిక. వేలాది ఎకరాల్లో బత్తాయి తోటలు నరికివేయబడ్డాయి. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రకృతి సృష్టించిన సంక్షోభం కాదు... విధానాల వైఫల్యం, మార్కెట్ నిర్లక్ష్యం సృష్టించిన సంక్షోభం.

**పామాయిల్‌కు ప్రాధాన్యం... బత్తాయికి ప్రోత్సాహం ఎక్కడ?**

ప్రస్తుతం ప్రభుత్వం, ఉద్యాన శాఖ పామాయిల్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. కొత్త పంటలను ప్రోత్సహించడం అవసరమే. అయితే దశాబ్దాలుగా నల్గొండ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బత్తాయి సాగు పునరుద్ధరణకు అదే స్థాయిలో ప్రాధాన్యం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన మొక్కల సరఫరా, వైరస్ నియంత్రణ, శాస్త్రీయ సాగు పద్ధతులు, తోటల పునరుద్ధరణ, పరిశోధన, కోల్డ్‌చైన్, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహం వంటి అంశాల్లో సమగ్ర కార్యాచరణ లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

**ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్... ఇంకా నెరవేరని రైతు కల**

నల్గొండ ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో ప్రత్యేక బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేసినప్పటికీ, బత్తాయి క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి స్థాయి కార్యకలాపాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. రైతులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదు.

మార్కెట్ లేక రైతు ఇప్పటికీ దళారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకే లేకపోవడం ఈ వ్యవస్థలోని అతిపెద్ద విషాదం.

**దళారుల చేతుల్లో ధరలు... నష్టాల్లో రైతులు**

బత్తాయి ధరను నిర్ణయించేది రైతు కాదు... దళారులే అన్న విమర్శ చాలా కాలంగా వినిపిస్తోంది. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక రైతు నష్టాల్లో కూరుకుపోతుంటే, మధ్యవర్తులే భారీ లాభాలు ఆర్జిస్తున్నారు.

పారదర్శక మార్కెట్ లేకపోవడం, నిల్వ సదుపాయాలు లేకపోవడం, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం రైతును మరింత బలహీనంగా మారుస్తున్నాయి.

**పెరిగిన పెట్టుబడి... కూలిపోతున్న రైతు ఆర్థిక వ్యవస్థ**

ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, విద్యుత్, సాగునీటి, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మరోవైపు మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో రైతు ఆదాయం తగ్గిపోయింది.

బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, బంగారం తాకట్టు... ఇవే నేటి బత్తాయి రైతు జీవితాన్ని నిర్వచిస్తున్న వాస్తవాలు. పంట కంటే అప్పులే పెద్ద భారం కావడంతో అనేక మంది రైతులు తమ తోటలను నరికివేసి ఇతర పంటల వైపు వెళ్లిపోతున్నారు.

**వ్యవస్థ మొత్తం స్పందించాల్సిన సమయం**

బత్తాయి సాగును కాపాడాలంటే రైతు ఒక్కరి కృషి సరిపోదు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, మార్కెటింగ్ శాఖ, ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలి.

**తక్షణం చేపట్టాల్సిన చర్యలు**

- ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో పూర్తి స్థాయి సమీకృత బత్తాయి మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలి.
- బత్తాయికి గిట్టుబాటు ధర భరోసా కల్పించే విధానాన్ని అమలు చేయాలి.
- దళారుల ఆధిపత్యాన్ని అరికట్టి పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- తోటల పునరుద్ధరణకు ప్రత్యేక సబ్సిడీలు, వడ్డీలేని రుణాలు అందించాలి.
- వైరస్ నియంత్రణ, అధిక దిగుబడి రకాల అభివృద్ధికి ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి.
- జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాకింగ్ కేంద్రాలు, ఎగుమతి సదుపాయాలు ఏర్పాటు చేయాలి.
- "నల్గొండ బత్తాయి పునరుజ్జీవన మిషన్" పేరుతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలి.

**బత్తాయిని కాపాడటం... తెలంగాణ ఉద్యాన రంగాన్ని కాపాడటమే**

నల్గొండలో బత్తాయి సాగు క్షీణించడం అంటే కేవలం ఒక పంట తగ్గిపోవడం కాదు. అది వేలాది రైతు కుటుంబాల జీవనాధారం కోల్పోవడం, లక్షలాది వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతినడం, ఒక ప్రాంత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడడం.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బత్తాయి రైతుకు మార్కెట్ భరోసా, గిట్టుబాటు ధర, శాస్త్రీయ సహాయం, ఆర్థిక రక్షణ కల్పించాలి. రైతు పండించిన పంటకు గౌరవప్రదమైన ధర దక్కినప్పుడే వ్యవసాయానికి భవిష్యత్తు ఉంటుంది.

నల్గొండ బత్తాయిని కాపాడటం అంటే ఒక పంటను కాపాడటం కాదు... వేలాది రైతు కుటుంబాల భవిష్యత్తును, ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థను, తెలంగాణ ఉద్యాన రంగ అస్థిత్వాన్ని కాపాడటమే.



**జి. అజయ్ కుమార్**



## దిక్షిత్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

**శ్రీకాళహస్తి,జులై 02,జయ జయహే.**

పట్టణంలోని కర్నాల వీధిలో కాపురం ఉంటున్న హరీష్, అర్చనల కుమారుడు దీక్షిత్ వయస్సు 3 సంవత్సరాలు, ఈ అబ్బాయికి ఆరోగ్యం సరిగా లేనందున ఈనెల 4 వ తేదీన చెన్నైలోని కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ ఆసుపత్రి నందు ఆపరేషన్ అని తెలిసి ఆపరేషన్ ఖర్చులకు తన వంతు సహాయం లో భాగంగా ఆదివారం హెల్పింగ్ హాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్ భాషా రూ.30,000లు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మునీర్ బాషా మాట్లాడుతూ ఆపరేషన్ అనంతరం ఆ అబ్బాయి ఆరోగ్యంగా బాగుండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు.తాము చేసిన ఈ సహాయంచిల్డ్రన్స్ ఫ్యాన్సీ షాప్ కు వచ్చే కస్టమర్లదే అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు న్యాయవాది గరికపాటి రమేష్ బాబు, కోళ్లూరు హరినాయుడు, సుధా ల్యాబ్ హబీబ్, మరియు చిల్డ్రన్స్ ఫ్యాన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బళ్ళారి రాఘవ జయంతి

**బళ్లారి రాఘవకి నివాళులర్పించిన తిరుపతి జిల్లా ఎస్పీ**

**తిరుపతి, ఆగస్టు 02, జయ జయహే.**



ప్రముఖ నాటక రంగ మహనీయుడు బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తెలుగు నాటక రంగానికి, కళా--సాంస్కృతిక రంగాలకు బళ్ళారి రాఘవ గారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ఆయన వంటి మహనీయుల ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిబద్ధతతో సేవలు అందించాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బళ్ళారి రాఘవ కి అంజలి ఘటించారు.

## ఈ యేడు తిరుమలలో
## రెండు బ్రహ్మోత్సవాలు

**సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వరుసగా నిర్వహణ**

**జయ జయహే**

తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటుంది. 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం ఉంటుంది. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనం, 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం

# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం!

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమిలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్దిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం.

విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే!

మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది

2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ




నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



# గ్రీన్ ఆపిల్స్ తింటే క్యాన్సర్ రాదా?

గ్రీన్ యాపిల్స్‌లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పండ్లలో ఎక్కువగా డైటరీ ఫైబర్ ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, కాల్షియం, ఐరన్‌లు ఉంటాయి. కేలరీస్, సోడియం, కార్బోహైడ్రేట్స్, డైటరీ ఫైబర్, ప్రోటీన్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. వీటిని తినడం వల్ల కలిగే లాభాలివే.

**జీర్ణ సమస్యలు..**
గ్రీన్ యాపిల్స్‌లో ఫైబర్ ఉంటుంది. జీర్ణ శక్తిని పెంచుతుంది. డైజెషన్‌ని పెంచి గట్‌హెల్త్‌ని పెంచుతుంది. గ్రీన్ యాపిల్స్‌లో పెక్టిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది హెల్దీ బ్యాక్టీరియాని పోషిస్తుంది. దీంతో మలబద్ధకం, డయేరియా వంటి సమస్యల్ని తగ్గిస్తుంది.

**శరీరంలోని కొవ్వుని కరిగించే పండ్లు**

**బరువు తగ్గడం..**
గ్రీన్ ఆపిల్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, బరువు తగ్గాలనుకునేవారు వీటిని తీసుకుంటే మంచిదని కొన్ని స్టడీస్ చెబుతున్నాయి. రెగ్యులర్‌గా గ్రీన్ ఆపిల్స్ తిన్నవారు తినని వారికంటే త్వరగా బరువు తగ్గినట్లు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

**కాన్సర్..**
గ్రీన్ ఆపిల్స్‌లో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి ఊపిరితిత్తులు, ప్యాంక్రియాటిక్, కొలన్ క్యాన్సర్స్‌ని దూరం చేస్తాయి. ముఖ్యంగా గ్రీన్ ఆపిల్స్‌లోని పీల్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి లివర్, కొలన్ క్యాన్సర్ సెల్స్‌ని తగ్గిస్తాయి.

**హార్ట్ హెల్త్..**
గ్రీన్ ఆపిల్స్‌లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బీపిని తగ్గిస్తుంది. దీంతో గుండె సమస్యలు, హార్ట్ స్ట్రోక్ వంటి సమస్యల్ని కూడా తగ్గించుకోవచ్చు. దీంతో పాటు వీటిలోని సొల్యూబుల్ ఫైబర్ కారణంగా గుండె సమస్యలు వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు.

**జుట్టుకి..**
కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు.. వీటిని తీసుకోవడం వల్ల అందం కూడా పెరుగుతుంది. గ్రీన్ ఆపిల్స్‌ని పేస్టులా చేసి తలకి అప్లై చేస్తే డాండ్రఫ్ తగ్గతుందని, దీనిని స్కాల్ప్‌కి మసాజ్ చేస్తే కుదుళ్ళు బలంగా మారతాయని చెబుతున్నారు.

**ఎక్కువగా వద్దు..**
అయితే, గ్రీన్ ఆపిల్స్ మోతాదులోనే తీసుకోవాలి. అదే విధంగా, కొంతమందికి వీటిని తిన్నప్పుడు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అలాంటప్పుడు తినే ముందు డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వడం మంచిదని గుర్తుపెట్టుకోండి.

# డెంగ్యూ నుంచి త్వరగా కోలుకోవాలంటే..

## ఈ ఫుడ్ ఐటమ్స్ తప్పక తీసుకోవాల్సిందే!




**ప్రతి ఏడాది జనం భారీ సంఖ్యలో డెంగ్యూ బారిన పడుతున్నారు. డెంగ్యూ దోమల సంతతి పెరగడానికి నిలువ నీరు కారణమవుతున్నది. ఒకవేళ మీరు డెంగ్యూ బారినపడితే తిరిగి కోలుకునే వరకు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. మీరు ఎంత త్వరగా డెంగ్యూ నుంచి కోలుకుంటారనేది మీరు తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి డెంగ్యూ బారీ నుంచి సత్వరమే బయటపడేసే కొన్ని ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..**

**1. కొబ్బరి నీళ్లు**
డెంగ్యూ బారిన పడితే శరీరం బాగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి కొబ్బరి నీళ్లు బాగా తోడ్పడుతాయి. కాబట్టి డెంగ్యూ రోగులకు వైద్యులు కొబ్బరి నీళ్లు తాగాలని సూచిస్తుంటారు.

**2. పొప్పడి ఆకుల రసం**
పొప్పడి ఆకుల రసం కూడా డెంగ్యూ చికిత్సలో బాగా పనిచేస్తుంది. డెంగ్యూ రోగి పొప్పడి ఆకుల రసం తీసుకోవడం వల్ల ప్లేట్‌లెట్ కౌంట్ మెరుగుపడుతుంది. అదేవిధంగా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. మంచి ఫలితం రావాలంటే డెంగ్యూ పేషెంట్ పొప్పడి ఆకుల రసాన్ని నీటితో కలిపి రోజుకు రెండుమూడు సార్లు తీసుకోవాలి.



**3. మేక పాలు**
మేక పాలలో సెలెనియం పుష్కలంగా ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో సెలెనియం కీలకపాత్ర పోషిస్తుంది. శరీరంలో వైరస్‌లు వృద్ధి చెందకుండా కూడా సెలెనియం తోడ్పడుతుంది. కాబట్టి డెంగ్యూ పేషెంట్‌లు త్వరగా కోలుకోవడానికి మేక పాలు తీసుకోవడం చాలా ముఖ్యం.

**4. కివీ ఫ్రూట్**
డెంగ్యూ పేషెంట్ కివీ పండును ఆహారంలో తీసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది శరీరంలో రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అంతేగాక ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది.

**5. వేప ఆకులు**
వేప ఆకులలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ఇవి వైరస్‌ల వృద్ధిని, వ్యాప్తిని అరికట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. డెంగ్యూ చికిత్సలో ప్రకృతి సిద్ధమైన ఔషధంగా వేప ఆకులు పనిచేస్తాయి. రోజూ ఉదయాన్నే లేత వేపాకులు తినడం ద్వారా ప్రయోజనం ఉంటుంది.

# రెగ్యులర్ ఉప్పు బదులు నల్ల ఉప్పు వాడితే లాభాలు



**నల్ల ఉప్పులో ముఖ్యంగా మూడు రకాలు ఉంటాయి. అవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచివి. హిమాలయన్ బ్లాక్ సాల్ట్, బ్లాక్ లావా సాల్ట్, బ్లాక్ రిచ్యువల్ సాల్ట్. ఈ మూడింటిలో ఒక్కొక్కటి ఒక్కో గుణం కలిగి ఉంది. దీనిని తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.**

**హిమాలయ నల్ల ఉప్పు..**
ఈ ఉప్పుని చాలా మంది వాడతారు. కాలా నమక్ అని పిలిచే ఈ ఉప్పులో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ఘాటైన, రుచికరంగా ఉండే ఈ ఉప్పుని చాలా మంది వంటల్లో వాడతారు. దీనిలో గుడ్డులో వచ్చే సల్ఫరస్ వాసన లాంటిది ఉ ంటుంది. దీంతో వెజ్ ఐటెమ్స్‌కి నాన్‌వెజ్ టచ్‌ని ఇచ్చే వంటల్లో ఎక్కువగా వాడతారు.

**ఉప్పు ఎక్కువగా తింటే ఏమవుతుందంటే..**

**బ్లాక్ లావా సాల్ట్..**
ఈ బ్లాక్ లావా ఉప్పుని హవాయి బ్లాక్ సాల్ట్ అంటారు. ఎందుకంటే, ఇది హవాయి నుండి వస్తుంది. ఇది చూడ్డానికి కాస్తా పింక్, క్రీమ్ కలర్‌లో ఉంటుంది. ఇది కాస్తా మట్టి రుచిని అందిస్తుంది. వంట చేశాక చివర్లో ఈ ఉప్పు చల్లాలి. దీంతో వంటకి స్మోకీ ఫ్లేవర్ వస్తుంది. ఈ ఫ్లేవర్ ఇష్టపడేవారు దీనిని హ్యాపీగా తినొచ్చు.

**బ్లాక్ రిచువల్ సాల్ట్..**
ఇది చూడ్డానికి నల్లగా ఉంటుంది. కాస్తా బూడిద రంగులో ఉంటుంది. దీనిని వంటల్లో వాడతారు. దీని వల్ల మంచి రుచి వస్తుంది. కాబట్టి, దీనిని కూడా ఇష్టంగా వాడతారు.

**హెల్త్ బెనిఫిట్స్..**
సాధారణంగా టేబుల్ సాల్ట్ కంటే ఈ నల్ల ఉప్పుని వాడడం వల్ల వంటల రుచి పెరుగుతుంది.
వీటిని మీకు ఏది అందుబాటులో ఉంటే దానిని తీసుకుని వాడొచ్చు.
ఇందులో రెగ్యులర్ ఉప్పుకంటే తక్కువ సోడియం ఉంటుంది.
సోడియం తక్కువగా ఉండే ఈ ఉప్పుని తీసుకోవడం వల్ల హైబీపి తగ్గుతుంది.
ఈ ఉప్పులో ఎక్కువ ఖనిజాలు ఉంటాయి.
ఈ నల్ల ఉప్పుని తింటే జీర్ణక్రియ మెరుగవుతుంది.
దీంతో గ్యాస్, ఉబ్బరం తగ్గుతుంది.
అంతేకాదు, చర్మం, జుట్టు సమస్యలని కూడా దూరం చేసే మినరల్ కంటెంట్ ఈ నల్ల ఉప్పులో ఉంది.
అయితే, ఎంత మంచిదైనా కూడా నల్ల ఉప్పుని తీసుకున్నప్పుడు బ్రాండ్‌ని అందులో ఉన్న గుణాలని చూసి కొనాలి. అదే విధంగా, తక్కువ మోతాదులోనే తీసుకోవాలని గుర్తుపెట్టుకోండి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com